క్లుప్తంగా

చిత్రలేఖన పోటీలు



పోటీలు నిర్వహిస్తున్న అధికారులు

పెంచికల్‌పేట్: ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో సోమవారం విద్యార్థినులకు అటవీశాఖ ఆధ్వర్యంలో చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. వన్యప్రాణుల సంరక్షణ చట్టాలను గురించి వివరించారు. వన్యప్రాణుల సంరక్షణకు ప్రతిఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. అనంతరం విద్యార్థినులకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌వో జగన్‌మోహన్ గౌడ్, ఎఫ్‌బీవోలు సతీష్, సంగదీప్, స్వర్ణలత, విజయలక్ష్మి, రాజు, రామయ్య పాల్గొన్నారు.

వాహనం ఢీకొని 14 గొర్రెలు మృతి



మృతి చెందిన గొర్రెలు

ఆసిఫాబాద్‌రూరల్: గుర్తు తెలియని వాహనం ఢీకొని 14 గొర్రెలు మృతి చెందిన ఘటన మండలం కేంద్రంలో చోటు చేసుకుంది. సోమవారం రాత్రి 8 గంటలకు జాతీయ రాహదారిపై బూర్గుడ సమీపంలో మహారాష్ట్ర నుంచి మంచిర్యాల్ వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం రోడ్డు దాటున్న క్రమంలో ఢీ కొట్టింది. దీంతో 14 గొర్రెలు అక్కడిక్కడి మృతి చెందాయి. మహబూబ్‌నగర్‌కు చెందిన తిరుపతి గొర్రెల మేత కోసం వలస వచ్చినట్లు తెలిపారు.

తాగునీటి సమస్యపై దృష్టి సారించాలి

నార్నూర్: ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన గ్రామాల్లో తాగునీటి సమస్యపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆల్ ఇండియా బంజారా సేవ సంఘం జిల్లా అధ్యక్షుడు జాదవ్ రెడ్డినాయక్ అన్నారు. సోమవారం మండలంలోని మహాగావ్ గ్రామంలో గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండలు పెరిగిపోవడంతో గ్రామాల్లో తాగునీటి సమస్య ప్రారంభం అయిందన్నారు. చాలా గ్రామాలకు మీషన్ భగీరథ నీరు సరఫరా కాకపోవడంతో ప్రజలు గోస పడుతున్నారన్నారు. జిల్లాస్థాయి అధికారులు పర్యటించి శాశ్వతంగా నీటి సమస్యకు పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చినా.. నేటికి నెరవేరలేదన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణానికి ఎమ్మెల్యేకు ఆహ్వానం



ఆహ్వాన పత్రిక అందజేస్తున్న సభ్యులు

బోథ్: మండలంలోని పొచ్చెర గ్రామంలోని వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ మహోత్సవానికి హాజరు కావాలని గ్రామస్తులు, అలయ కమిటీ సభ్యులు సోమవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కు ఆహ్వాన పత్రిక అందజేశారు. నేరడిగొండ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను కలిశారు.

త్వరలోనే కళ్లద్దాలు అందిస్తాం



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

బోథ్: మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)లో 92 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. బోథ్ మండల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల, సొనాల మండలంలోని పార్డి(బి) గ్రామంలోని గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల, నేరడిగొండ మండలంలోని కేజీబీవీ, ఆశ్రమ ఉన్నత పాఠశాల, కుంటాలలోని ఆశ్రమ ఉన్నత పాఠశాల, బజార్‌హత్నూర్ మండలంలోని మోడల్ స్కూల్‌లో ఇదివరకు విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ పాఠశాలలల నుంచి 92 మంది విద్యార్థులకు బోథ్ సీహెచ్‌సీలో మరోసారి కంటి పరీక్షలు నిర్వహించగా, 89 మంది విద్యార్థులకు కళ్లద్దాలు అవసరమని వైద్యులు గుర్తించారు. త్వరలోనే వారికి కళ్లద్దాలను పంపిణీ చేస్తామని అన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ రాజనాల రవీంద్ర ప్రసాద్, ప్రొఫెసర్ డి. సౌమ్య, ఆప్మాల్మిక్ అధికారి ఆర్.భాస్కర్, సాగర్, సిబ్బంది పాల్గొన్నారు.

స్థల సేకరణలో జాప్యం

- జీపీ కార్యాలయాల నిర్మాణానికి గ్రహణం
- ఏళ్లు గడుస్తున్నా ముందుకు కదలని పనులు



నిర్మాణ దశలో జంబుల్‌ధరి జీపీ కార్యాలయం

వాంకిడి: పంచాయతీ కార్యాలయ భవనాల నిర్మాణంలో జాప్యంతో అధికారులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. నిధులు మంజూరై ఏళ్లు గడుస్తున్నా పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. మండలంలోని పాతవి 11 జీపీలు ఉండగా.. కొత్తగా ఏర్పడిన 17 కలుపుకుని మొత్తం 28 గ్రామ పంచాయతీలున్నాయి. కొత్తగా ఏర్పడిన 17 జీపీలతో పాటు పాత జీపీలలో కొన్ని భవనాలు శిథిలావస్థకు చేరడంతో కొత్త నిర్మాణాలకు ఈజీఎస్ నిధులను కేటాయించారు. కొన్నింటికి ఐటీడీఏ నుంచి నిధులను మంజూరు చేశారు. రూ.20 లక్షల చొప్పున మండలంలోని 20 గ్రామ పంచాయతీలలో నూతన భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. అధికారుల నిర్లక్ష్యానికి ఏళ్లుగా కార్యాలయాల నిర్మాణాలకు పునాదులు పడటం లేదు. పాడుబడిన ప్రభుత్వ భవనాలు, కమ్యూనిటీ హాల్, హెల్త్ సెంటర్లలో కార్యకలపాలు నిర్వహిస్తున్నారు.

నిర్మాణంలో జాప్యం ఇలా..

నిధులు మంజూరై ఏళ్లు గడుస్తున్నా నిర్మాణంలో మాత్రం తీవ్ర జాప్యం జరుగుతుంది. దొడ్డిగూడ, గోయెగాం, ఇందానీ, ఖిరిడి, లక్మీపూర్, లెండిగూడ, యవేగాం, నవేగూడ, సామేలా, సరాండి జీపీలలో కార్యాలయ భవనాల నిర్మాణాలకు ఇప్పటికీ స్థల సేకరణ జరగలేదు. చిచ్చుపల్లి, దాబా, జంబుల్‌ధరి, నవేధరి, పాటగూడ, పిప్పర్‌గోంది, తేజాపూర్, జైత్‌పూర్, కోమటిగూడ, వాంకిడి కలాన్ జీపీలలో రెండేళ్ల క్రితం పనులు ప్రారంభించగా వాంకిడి కలాన్, జైత్‌పూర్, కోమటిగూడలలో మాత్రమే పనులు పూర్తయ్యాయి. మిగతా ఏడు జీపీ భవనాలు నిర్మాణ దశలోనే ఉన్నాయి. సకాలంలో బిల్లులు అందకపోవడంతో కాంట్రాక్టర్లు పనులను ఆలస్యం చేస్తున్నారు. వర్షం కురిసినప్పుడు పాత భవనాలు ఉరుస్తుండటంతో రికార్డులు, బ్లీచింగ్, ఇతర సామగ్రి తడిసిపోతుందని అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి జీపీ భవనాలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం



ఈజీఎస్, ఎస్టీ కంపోనెంట్ నుంచి పక్కా భవనాలు లేని జీపీ కార్యాలయాల నిర్మాణాలకు రూ.20 లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయి. కొన్ని గ్రామ పంచాయతీలలో నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. త్వరగా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవడం జరుగుతుంది. భవన నిర్మాణాల స్థితిగతులపై ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం.

– ప్రవీణ్ కుమార్, ఎంపీడీవో వాంకిడి

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత



మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు, అధికారులు



ర్యాలీ నిర్వహిస్తున్న అటవీ అధికారులు

సిర్పూర్(టి): వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత అని సిర్పూర్(టీ) అటవీశాఖ రేంజ్ అధికారి ఇక్బాల్ హుస్సేన్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని అటవీశాఖ కార్యాలయంలో ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈసందర్భంగా అటవీశాఖ రేంజ్ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. వన్యప్రాణుల సంరక్షణతో పాటు అడవులను సంరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో శ్రీధర్ చారి, ఎఫ్ఎస్‌వోలు మోహన్‌రావ్, తిరుపతి, మోతిలాల్, ప్రసాద్‌రావ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చింతలమానెపల్లి: వన్యప్రాణుల రక్షణ అందరి బాధ్యత అని ఖర్జెల్లి డిప్యూటీ రేంజ్ అధికారి సంతోష్ అన్నారు. ఖర్జెల్లి రేంజ్ పరిధిలో సోమవారం ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాబాపూర్ బాలికల ఆశ్రమ పాఠశాలలో వన్యప్రాణుల, పర్యావరణ సంరక్షణ అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఇందులో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం రవీంద్రనగర్‌లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌వోలు మోహన్, సూర్యారావు, ఎఫ్‌బీవోలు ఆలం ప్రభాకర్, సుక్రు, దినేష్, నవ్యశ్రీ, సుధీర్, రూపాదేవి పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు హాల్‌టికెట్లు పంపిణీ



హాల్‌టికెట్లు పంపిణీ చేస్తున్న అధ్యాపకులు

దహెగాం: ఇంటర్ వార్షిక పరీక్షలు రేపటి నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు సోమవారం హాల్ టికెట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా సీఎస్ గణపతి మాట్లాడుతూ.. మండల కేంద్రంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, కేజీబీవీలు ఉన్నాయి. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 125 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరంలో 131 మంది విద్యార్థులు ఉన్నారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు 5న, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు 6న పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

'పార్టీ బలోపేతానికి కృషి'



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దండె విఠల్

కౌటాల: కాంగ్రెస్ బలోపేతానికి కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కాంగ్రెస్‌తోనే గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి సాధ్యమని, కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందన్నారు. సమావేశంలో జెడ్పీ మాజీ చైర్మన్ సిడాం గణపతి, బసర్కార్ విశ్వనాథ్, నానయ్య, నికాడే గంగారాం, జగ్గగౌడ్, తిరుపతి, రవీందర్‌గౌడ్, సోమయ్య, రవి, గట్టయ్య, బాపు, భీంరావు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మూలమలుపులు



మొర్రిగూడ ఘాట్ వద్ద ప్రమాదకరంగా మూలమలుపు

- కానరాని సూచిక బోర్డులు
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులు

తిర్యాణి: మండల కేంద్రం నుంచి నిత్యం వందలాది మంది మంచిర్యాల జిల్లాలోని ఐబీ, తాండుర్, బెల్లంపెల్లి, మంచిర్యాల రాకపోకలు సాగిస్తుంటారు. అయితే మండల కేంద్రం నుంచి మంచిర్యాల వైపునకు వెళ్లే దారిలో ఉన్న ఘాట్ సెక్షన్‌లో మూలమలుపులు ప్రమాదకరంగా మారాయి. నిత్యం ఘాట్ సెక్షన్‌లోని మూలమలుపుల వద్ద ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. గతంలో ఒక అర్టీసీ బస్సు సైతం ఆదుపు తప్పింది.

కానరాని సూచిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు..

మొర్రిగూడ గ్రామపంచాయతీ పరిధిలోని ఘాట్ సెక్షన్ వద్ద గల ప్రమాదకరమైనా మూల మలుపుల వద్ద అధికారులు ఏటువంటి సూచిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు అనేక ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. కొత్తగా ఈ ప్రాంతానికి వచ్చే వారు వాహనాలు నడపడం మరింత కష్టమవుతుంది. రాత్రి ఎక్కడ మూలమలుపు ఉందో కుడా తెలియని పరిస్థితి. అధికారులు స్పందించి సూచక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఎవరూ పట్టించుకోవడం లేదు



మండల కేంద్రం నుంచి ఐబీ వైపునకు వెళ్లే దారిలో ఉన్న మూల మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి. సూచిక బోర్డులు లేకపోవడంతో రాత్రి ఎక్కడ మూలమలుపు ఉందో తెలియక ప్రమాదాలు జరుగుతున్నాయి.

– మ్యాన రాజు, తిర్యాణి

స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయాలి



ఐబీ(తాండుర్) మీదుగా కొత్తగా మండల కేంద్రానికి వచ్చే వాహనాదారులు మూలమలుపుల మీదుగా ప్రయాణించడానికి అనేక ఇబ్బంది పడుతున్నారు. మూలమలుపుల వద్ద వాహనాల వేగంను నిరోధించడానికి అధికారులు స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలి.

–పులి వెంకటేశ్,నాయకపుగూడ

సమస్యలు పరిష్కరించండి



వినతిపత్రం అందజేస్తున్న విశ్రాంత ఉద్యోగులు

ఆసిఫాబాద్అర్బన్: ఆర్టీసీ సంస్థలో పని చేసి ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సోమవారం విశ్రాంత ఉద్యోగులు డిపో మేనేజర్ విశ్వనాథ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రిటైర్డ్ అయిన ఉద్యోగులకు రావాల్సిన 2017 నుంచి పీఆర్సీని అమలు చేసి, బకాయిలను చెల్లించాలన్నారు. పీఆర్సీతో పాటు 2022 నుంచి నేటి వరకు రిటైర్డ్ అయిన వారికి పని చేసిన చివరి వేతనం, గ్రాట్యువిటీ, లీవ్ ఎన్‌క్యాష్ సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు మల్లేశం, ఉపాధ్యక్షుడు దివాకర్, భీంరావ్, మోహన్, రాంచందర్, తదితరులు ఉన్నారు.

విద్యార్థుల్లో పఠనాసక్తి పెంచాలి



పరిశీలిస్తున్న జయరాజ్

చింతలమానెపల్లి: విద్యార్థులు పుస్తకాలు చదివే విధంగా పఠనాసక్తిని పెంచాలని మండల విద్యాధికారి జయరాజ్ అన్నారు. మండలంలోని చింతలమానెపల్లి మండల పరిషత్ పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థుల పుస్తకాలు చదివే నైపుణ్యాన్ని ఆయన పరిశీలించారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు మెలకువలను తెలపాలని, సులువుగా అర్థమయ్యేలా బోధన ఉండాలన్నారు. ప్రాథమిక స్థాయిలో అందించే బోధన ఉన్నత తరగతులలో ఉపయోగపడాలన్నారు. ప్రభుత్వం విద్యార్థుల నైపుణ్యానిన పెంచేందుకు చేపడుతున్న చర్యలను ఉపాధ్యాయులు వినియోగించుకోవాలని అన్నారు.

సమాజానికి ఆదర్శంగా నిలవాలి



ప్రభుత్వ ఉద్యోగులతో మాదిగ జాగృతి సంఘం నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: నూతనంగా ఉద్యోగాలు సాధించి పదోన్నతులు పొందిన ఉద్యోగులు సమాజానికి ఆదర్శంగా నిలవాలని పలువురు నేతలు పేర్కొన్నారు. ఉద్యోగాలు సాధించిన వారు మహనీయుల ఆశయాలను కొనసాగించేందుకు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని న్యూ అంబేడ్కర్ భవనంలో మాదిగ జాగృతి సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళం నిర్వహించారు. నూతనంగా ఉద్యోగాలు సాధించిన ఉద్యోగులకు, పదోన్నతులు పొందిన ఉద్యోగులకు ఆత్మీయంగా శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. మహనీయుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ గట్టయ్య, ఎస్సీ స్టడీ సర్కిల్ సెంటర్ డైరెక్ట్ కుంటాల రమేశ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మన జాతులకు మనమే అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు రమేష్ మహరాజ్, అన్నెల లక్ష్మణ్, అగ్గిమల్ల గణేష్, ఈర్ల దయాకర్, శ్రీకర్, అన్నెల ఆడేల్లు పాల్గొన్నారు.

పెళ్లికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం చేస్తున్న మహిళలు

నేరడిగొండ: పేదింటి అమ్మాయి పెళ్లికి గ్రామంలోని ఆడపడుచులందరు ఒక్కటయ్యారు. మండలంలోని మంగల్‌మోట (తర్నం) గ్రామానికి చెందిన యువతి వివాహం సోమవారం జరగగా అరవై కుటుంబాల ఆడపడుచులు రూ.12,342 జమ చేసి పెళ్లి కోసం తమవంతు సాయం అందించారు. ఆదివాసీ గ్రామాల్లో కట్న కానుకలను నిషేధిస్తూ ఆదివాసీలు తీర్మానం చేసిన విషయం విధితమే. దీంతో ఎలాంటి కట్నకానుకలు లేకపోగా తమవంతుగా వీటిని అందించినట్లు పేర్కొన్నారు.

సిరికొండ: మండలంలోని సోన్‌పెల్లి గ్రామంలో షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం అయి నిరాశ్రయులైన వాగ్మరే మాధవ్ కుటుంబానికి ఎస్సై శివారం రూ. 5 వేల ఆర్థిక సాయంతో పాటు దుప్పట్లు, నిత్యావసర సరుకులు సోమవారం అందజేశాడు. ఆయనతో పాటు మాజీ సర్పంచ్ కదం సూర్యకాంత్, బోయిన్‌వాడ్ అమోల్, సిబ్బంది ఉన్నారు.

పరీక్ష కేంద్రాల్లో స్వచ్ఛ సేవలు



శుభ్రం చేస్తున్న జీపీ కార్మికులు

కెరమెరి: మండలంలోని కెరమెరి, మోడి ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో సోమవారం స్వచ్ఛ సేవలు నిర్వహించినట్లు ఎంపీడీవో అంజద్‌పాషా తెలిపారు. ఆయా పాఠశాల పరిసరాల్లో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు. పారిశుద్ధ్యం పనులు చేపట్టారు. మరుగొడ్లు, స్నానపుగదులను శుభ్రం చేశారు. నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టారు. బ్లీచింగ్ పౌడర్ చల్లారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ

తిర్యాణి: మండలంలోని రొంపెల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇంటి పథకం కింద మంజూరైనా రెండు ఇళ్లకు సోమవారం అధికారులు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామంలో 106 అర్హులైన కుటుంబాలకు ఇళ్లు మంజూరైనట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిత్తారి సాగర్, పెరుమాండ్ల వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

మహిళా దినోత్సవాన్ని విజయవంతం చేయండి



ఆహ్వాన పత్రం అందజేస్తున్న నాయకులు



మాట్లాడుతున్న నగేశ్

ఆదిలాబాద్: జాతీయ దివ్యాంగ మహిళా దినోత్సవాన్ని జయప్రదం చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక అధ్యక్షుడు మెస్రం నగేశ్ పిలుపునిచ్చారు. పట్టణంలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. దివ్యాంగ మహిళలపై దేశంలో రోజురోజుకు ఆకృత్యాలు పెరిగిపోతున్నాయన్నారు. వీటికి అడ్డుకట్ట వేయడానికి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అన్ని సంక్షేమ పథకాల్లో దివ్యాంగ మహిళలకు ప్రత్యేక వెసులుబాటు కల్పించాలని డిమాండ్ చేశారు. అరిఫా, కుంర శత్రుఘన్, చుక్కబొట్ల పొచ్చన్న, వజ్రాల పొచ్చన్న, అనసూయ, బుచ్చక్క, పద్మ పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: ఈనెల 8న ఆదిలాబాద్ జిల్లా మావల మండలంలోని కుమురం భీం కాలనీలో నిర్వహించే అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలను విజయవంతం చేయాలని తుడుందెబ్బ, ఆదివాసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోడం గణేష్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పర్ధాన్‌గూడలో పర్ధాన్ పెద్దలకు కరపత్రాలు అందజేశారు. జిల్లా నలుమూలల నుంచి 9 తెగల ఆదివాసీలు, అనుబంధ సంఘాల నాయకులు భారీగా తరలిరావాలన్నారు. కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా కార్యదర్శి గేడం భారత్, సోయం మురహరి, బారిక్‌రావ్, తదితరులు పాల్గొన్నారు.

నాగోబా ఆలయంలో పూజలు



పూజలు చేస్తున్న బీజేపీ నాయకులు

ఇంద్రవెల్లి: కేస్లాపూర్ నాగోబా ఆలయంలో సోమవారం నిర్మల్ జిల్లా నూతనంగా ఎన్నికైన బీజేపీ జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్‌తో పాటు జిల్లా నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. మెస్రం వంశీయులు బీజేపీ నాయకులను శాలువాతో సన్మానించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఆరెల్లి రాజలింగు, శివకుమార్ జైస్వాల్, మారుతి దేవ్‌పూజే, మెస్రం తుకారం,దిలీప్ మోరే,మస్కే రాజువర్ధన్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



పట్టుకున్న బియ్యంతో పోలీస్ సిబ్బంది

ఆసిఫాబాద్‌రూరల్: అక్రమంగా రవాణ చేసేందుకు వ్యవసాయ పొలంలో నిల్వ ఉంచిన 9 క్వింటాళ్ల రేషన్ బియ్యంను ఆదివారం రాత్రి పట్టుకున్నట్లు సీఐ రవీందర్ తెలిపారు. మండలంలోని బూర్గుడ గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలంలో అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ ఉన్నట్లు పక్కా సమాచారంతో రైడ్ చేసి పట్టుకున్నామన్నారు. రేషన్ బియ్యంను రాజేశ్వర్‌ను రవాణ చేసేందుకు సిద్ధం అవుతున్న క్రమంలో పట్టుకున్నామన్నారు.